



కార్తీ అనే యువకుడికి కారు అందజేస్తున్న మంత్రులు మూర్తి, పళనివేల్ త్యాగరాజన్ - వాడివాసల్ వద్ద యువకులను బెంబేలెత్తించిన ఎద్దు

అట్టహాసంగా అవనియాపురం జల్లికట్టు

- వాడివాసల్‌లో రంకెలేసిన ఎద్దులు
- ధైర్యసాహసాలను ప్రదర్శించిన యువకులు
- 45 మందికి గాయాలు
- యువకుడి మృతి
- శశికళ ఎద్దుకు ట్రాక్టర్ బహుమానం

టి.నగర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మదురై జిల్లా అవనియాపురంలో జల్లికట్టు పోటీలు అట్టహాసంగా జరిగాయి. ఈ పోటీల్లో 19 ఎద్దులను అణచిన తిరుప్పరంకుండ్రం ప్రాంతానికి చెందిన కార్తీ అనే యువ సాహసికుడికి కారు, ఆవుదూడ కానుకలుగా అందజేశారు. ఇక ఈ పోటీల్లో క్రీడాకారులకు పట్టుచిక్కకుండా పరుగులు తీసిని వీకే శశికళ ఎద్దు మొదటి బహుమతి గెలుచుకుంది. ఆ ఎద్దు సంరక్షకుడు మలయాండిపై క్రీడానిర్వాహకులు కానుకల వర్షం కురిపించారు. అదే సమయంలో ఈ పోటీల్లో ఎద్దులను అణిచివేసే క్రమంలో నవీన్ అనే యువకుడు ఓ ఎద్దు కొమ్ములతో పొడవడంతో మరణించాడు. ప్రతియేటా సంక్రాంతి సందర్భంగా మదురై జిల్లా అవనియాపురం, పాలమేడు, అలంగానల్లూరు ప్రాంతాల్లో నిర్వహించే జల్లికట్టు పోటీలు ప్రపంచ ప్రఖ్యాతి గాంచాయి. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం 6.30 గంటలకు అవనియాపురంలో సంక్రాంతి తొలి జల్లికట్టు ప్రారంభమైంది. ఈ పోటీని మంత్రి మూర్తి జెండా ఊపి ప్రారంభించారు. ఈ పోటీలు 11 రౌండ్లుగా కొనసాగాయి. ప్రతి రౌండులోనూ తలా 50 మంది చొప్పున పాల్గొన్నారు.. పది రౌండ్ల తర్వాత ప్రతిభాపాటవాలను ప్రదర్శించిన 30 మందిని ఎంపిక చేసిన ఫైనల్ రౌండ్ జరిపారు. వాడివాసల్‌లో ఎద్దులు రంకెలు వేసుకుంటూ యువకులకు చిక్కకుండా పరుగెత్తాయి. యువకులు తమ ప్రాణాలకు తెగించి ఎద్దులను అణచివేయడానికి ప్రయత్నించారు. ఈ పోటీలకు పాల్గొనేందుకు 2026 ఎద్దులు రాగా 1735 మంది యువకులు పేర్లు నమోదు చేసుకున్నారు చివరి వైద్య పరీక్షల తర్వాత 500 మంది యువకులను ఈ పోటీల్లో పాల్గొనేందుకు నిర్వాహకులు అనుమతించారు.

విజేతలపై కానుకల వర్షం..

జల్లికట్టు క్రీడలలో ఎద్దులను అణచివేయడం అత్యంత ధైర్యసాహసాలను ప్రదర్శించిన యువకులను జల్లికట్టు నిర్వాహకులు కానులతో ముంచెత్తారు. 19 ఎద్దులను అణచిన తిరుప్పరంకుండ్రం ప్రాంతానికి చెందిన కార్తీ అనే యువకుడికి ప్రథమస్థానం, 15 ఎద్దులను అణచిన కుండ్రత్తూరుకు చెందిన అరవింద్ దివాకర్ ద్వితీయ స్థానం, 14 ఎద్దులను అణచిన తిరుభువనం ప్రాంతానికి చెందిన మురళీధరన్ తృతీయ స్థానం లభించాయి. ఈ పోటీలలో విజేతలు కార్తీకి రూ.8.50లక్షల విలువైన నిసాన్ కారును, ఆవుదూడ, అరవింద్ దివాకర్‌కు ద్విచక్రవాహనాలు తదితర వస్తువులను కానుకగా అందజేశారు.



నవీన్ (ఫైల్‌ఫోటో)

మదురై యువకుడి మృతి..

ఈ పోటీల్లో ఎద్దులను అణచివేయడంలో అత్యంత ధైర్యసాహసాలను ప్రదర్శించిన మదురై విలాంగుడి ప్రాంతానికి చెందిన నవీన్ అనే యువకుడు ఓ ఎద్దు పొడవటంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని వైద్యసిబ్బంది అంబులెన్స్‌లో స్థానిక ఆసుపత్రికి తరలించి చికిత్సలందించారు. తరువాత మెరుగైన వైద్యం కోసం మదురై రాజాజీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స ఫలించక నవీన్ మృతి చెందాడు.

45 మందికి గాయాలు..: ఈ పోటీల్లో యువ క్రీడాకారులు, ఎద్దుల యజమానులు, ప్రేక్షకులు, కానిస్టేబుల్ సహా 45 మంది ఎద్దులు పొడవటంతో తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో 12 మందిని మదురై రాజాజీ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గ్యాలరీల నుండి ప్రేక్షకులు దూసుకురావటంతో బారికేడ్లు ధ్వంసమై ఓ ఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుళ్లు తీవ్రంగా గాయపడ్డారు.

శశికళ ఎద్దుకు ట్రాక్టర్ కానుక..

ఈ జల్లికట్టు క్రీడలో యువకులకు చిక్కకుండా పరుగులు తీసిన వీకే శశికళకు చెందిన ఎద్దుకు మొదటి బహుమతిగా రూ.10లక్షల ట్రాక్టర్‌ను దాని సంరక్షకుడు మలయాండికి అందజేశారు. ఇదే విధంగా మదురై మేయర్ ఇంద్రాణి పొన్ వసంత్‌తరఫున ఆవుదూడ కానుకగా ఇచ్చారు. జీఆర్ కార్తీక్‌కు చెందిన ఎద్దుకు ద్వితీయ బహుమతిగా మోటారు బైకు అందజేశారు. విజేతలైన క్రీడాకారులకు, ఎద్దుల సంరక్షకులకు మంత్రులు మూర్తి, పళనివేల్ త్యాగరాజన్, మదురై జిల్లా కలెక్టర్ సంగీత బహుమతులను అందజేశారు.



ఎద్దును పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్న యువకులు

పాలమేడులో ....

- విజేత పార్తిబన్‌కు ఉదయనిధి కారు

పాలమేడులో బుధవారం ఉదయం జల్లికట్టు కోలాహలంగా ప్రారంభమైంది. సుమారు 930 ఎద్దులు ఇందులో పాల్గొన్నాయి. మంగళవారం ముగిసిన అవనియాపురం జలికట్టుకు దీటుగా పాలమేడు జల్లికట్టులో ఎద్దులు యువకుల చేతికి చిక్కకుండా పరుగులు తీశాయి. పాలమేడు గ్రామ సర్వజన మహాలింగ మఠం కమిటీ, మదురై జిల్లా యంత్రాంగం సంయుక్తంగా ఈ జల్లికట్టు నిర్వహించాయి. ముందుగా ఎద్దులను అణచివేయడానికి సిద్ధమవుతున్న యువకుల చేత జిల్లా కలెక్టర్ సంగీత ప్రతిజ్ఞ చేయించారు. ఆ తర్వాత మంత్రి మూర్తి, కలెక్టర్ సంగీత జెండాను ఊపి పోటీలను ప్రారంభించారు. పోటీలో 14 ఎద్దులను అణచివేసిన నత్తం ప్రాంతానికి చెందిన పార్దీబన్ అనే యువకుడు విజేతగా నిలిచాడు. అతడికి ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి తరఫున లగ్జరీ కారు కానుకగా అందజేశారు. 13 ఎద్దులను అణిచి ద్వితీయ స్థానంలో నిలిచిన మంజంపట్టికి చెందిన తులసిరామ్ అనే మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థికి లగ్జరీ బైకు, పొదుంబు గ్రామానికి చెందిన ప్రభాకరన్, కమల్‌రాజ్ అనే యువకులు, 11, 8 ఎద్దులను అణచి మూడో స్థానం, నాలుగోస్థానంలో నిలిచారు. ఇక ఈ పోటీలలో పాల్గొన్న సత్తిరపట్టికి చెందిన తంగపాండియన్ అనే రైతుకు చెందిన ఎద్దు విజేతగా నిలవగా, ఆ రైతుకు ట్రాక్టర్‌ను బహుమానంగా ప్రకటించారు.

90 మందికి గాయాలు...

పాలమేడు జల్లికట్టులో 90 మంది గాయపడ్డారు. వీరిలో ఎద్దులను అణచివేసేందుకు ప్రయత్నించిన యువకులు, ప్రేక్షకులు, కానిస్టేబుళ్లు, క్రీడా నిర్వాహకులు కూడా ఉన్నారు. ఈ జల్లికట్టులో ఓ ఎద్దు మైదానంలో ఉన్న షణ్ముగం అనే రైతుకు చెందిన ఎద్దును తన కొమ్ములతో కుమ్మి ఎత్తిపడేసింది. తీవ్రంగా గాయపడిన ఆ ఎద్దును వెటర్నరీ సిబ్బంది ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించింది.

టంగ్‌స్టన్ తవ్వకాలకు నిరసన...

పాలమేడు జల్లికట్టు క్రీడా ప్రాంగణం అంతా మేలూరు వద్ద టంగ్‌స్టన్ తవ్వకాలకు అనుమతిచ్చిన కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్థానికులు పోస్టర్లు, ఫ్లకార్డులను ఏర్పాటు చేశారు.



జానపద కళాకారులతో విదేశీయులు

భక్తి శ్రద్ధలతో పొంగల్

రాష్ట్రవ్యాప్తంగా సందడే.. సందడి..!

ప్యారీస్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మకంగా పొంగల్‌ను ప్రజలంతా సంతోషంగా జరుపుకొన్నారు. మంగళవారం సంక్రాంతి సందర్భంగా ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. భోగి, పొంగల్ వరుస సెలవులు రావడంతో నగరాల నుంచి సొంతూళ్లకు వెళ్లడంతో ప్రతి ఇల్లు కళకళలాడిపోతోంది. వ్యవసాయానికి పేరొందిన జిల్లాల్లో పైరుపంటల మధ్య ఊరంతా ఎక్కడ చూసినా జనమే జనం. భోగి మంటలు వేసి సంప్రదాయ బద్ధంగా పొంగల్ పండుగకు ప్రజలు స్వాగతం పలికారు. గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారుల నుంచి పెద్ద వారి వరకు పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆటల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. మదురైలో కనువిందు చేస్తున్న జల్లికట్టు పోటీలను తిలకించేందుకు తరలివచ్చిన విదేశీ పర్యాటకులు మహిళలతో కలిసి పొంగల్ వేడుకల్లో పాల్గొన్నారు. పల్లె వాతావరణంలో గ్రామ ప్రజలతో పాటు సరదాగా గడిపిన విదేశీ పర్యాటకులు తమిళ సంప్రదాయాల గురించి అడిగి తెలుసుకొని, అక్కడి స్థానికులతో సెల్ఫీలు కూడా దిగారు.



పొంగల్ కార్యక్రమంలో విదేశీయులు

వచ్చే సంక్రాంతి నాటికి డీఎంకే సమాధి

- ఈపీఎస్ శపథం

చెన్నై, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది సంక్రాంతికల్లా డీఎంకేని కూకటి వేళ్లతో సహా పెకలిస్తామని, రాష్ట్రం నుంచి ఆ పార్టీని తరిమికొడతామని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) శపథం చేశారు. అన్నాడీఎంకే సేలం సబర్బన్ శాఖ ఆధ్వర్యంలో వీరపాండి అసెంబ్లీ నియోజకవర్గపరిధిలోని పుత్తూరు ప్రాంతంలో బుధవారం ఉదయం నిర్వహించిన సంక్రాంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ ఓ రైతు బిడ్డగా తాను సంక్రాంతి వేడుకల్లో పాల్గొనటం తనకెంతో ఆనందంగా ఉందని, రాష్ట్రంలో డీఎంకే వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని, వచ్చే పొంగల్ నాటికి ఆ పార్టీని కూకటి వేళ్లతో కూల్చిపడేస్తామని అన్నారు. తన హయాంలో ప్రారంభించిన పశుసంవర్ధక పరిశోధనా కేంద్రాన్ని మూడేళ్లుగా ప్రారంభించకుండా కాలయాపన చేసిన డీఎంకే ప్రభుత్వం శాసనసభలో ఆ విషయాన్ని తాను ప్రస్తావిస్తాననే భయంతో ప్రారంభోత్సవం జరిపిందని చెప్పారు. పార్టీ శ్రేణులందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన ఈపీఎస్ వచ్చే యేడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలకు పార్టీ కార్యకర్తలంతా వెంటనే ప్రచార కార్యక్రమాలను ప్రారంభించాలని పిలుపునిచ్చారు.



జల్లికట్టు ఎద్దులతో ఎడప్పాడి

కోలాహలంగా కనుమ పండుగ



సముద్రంలో పశువులకు స్నానం చేయిస్తున్న దృశ్యం

ప్యారీస్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి వేడుకల్లో మూడో రోజైన బుధవారం కనుమ పండుగను రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. రైతులు తాము పెంచుకున్న పశువులకు చెరువులు, వాగులో, సముద్రతీరాలత్లో స్నానం చేయించారు. అనంతరం పసుపు కుంకుమ దిద్ది మెడలో పూల దండలు వేసి అలంకరించి గోపూజ చేసి పొంగలి నైవేద్యంగా పెట్టారు. అనంతరం శనగలు, బెల్లం, అరటిపండ్లు, అవిసాకు, తదితరాలను పశువులకు తినిపించి వీధులలో పరుగులు తీయించారు. గ్రామీణ ప్రాంతాల్లో పశువుల కొమ్ములకు రంగులు దిద్ది, ముక్కుకు కొత్త తాళ్లను కట్టి, వ్యవసాయానికి ఉపయోగించే పనిముట్లతో పాటు పూజించారు. అదే విధంగా మెరీనా బీచ్‌లో యజమానులు అలల మధ్య పశువులకు స్నానం చేయించి సముద్రతీరంలో పూజలు నిర్వహించారు.

ఘనంగా తిరువళ్లువర్ దినోత్సవం

తమిళపండితులు, సేవాపరులకు అవార్డులు అందజేసిన సీఎం స్టాలిన్



'తిరువళ్లువర్ అవార్డు'ను తమిళపండితుడు పటిక్కారామ్‌కు, 'పెరుంతలైవర్ కామరాజర్ అవార్డు'ను టీఎన్‌సీసీ మాజీ అధ్యక్షుడు కేవీ తంగబాలుకు అందజేస్తున్న ముఖ్యమంత్రి

చెన్నై, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లువర్ దినోత్సవంలో భాగంగా తమిళభాషాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో తమిళ పండితులు, సేవాపరులు 10 మందికి ముఖ్యమంత్రి స్టాలిన్ అవార్డులను ప్రదానం చేశారు. బుధవారం ఉదయం సచివాలయంలో జరిగిన ఈ వేడుకల్లో 2025 సంవత్సరానికిగాను తిరువళ్లువర్ అవార్డును సెంతమిళ్ సెమ్మల్ పెరుంపులవర్ (మహా పండితుడు) పటిక్కారామ్‌కు, అన్నా అవార్డును ఎల్.గణేశన్‌కు, పెరుంతలైవర్ కామరాజర్ అవార్డును టీఎన్‌సీసీ మాజీ అధ్యక్షుడు కేవీ తంగబాలుకు ప్రదానం చేశారు. ఇదే విధంగా మహాకవి భారతియార్ అవార్డును సుప్రసిద్ధ తమిళ కవి కపిలన్‌కు, భారతిదాసన్ అవార్డును 'కవిదై పేరొళి' పొన్ సెల్వగణపతికి, తిరువిక అవార్డును డాక్టర్ జీఆర్ రవీంద్రనాథ్‌కు, 'ముత్తమిళ్ కావలర్ కేఏపి విశ్వనాథం అవార్డును విఎం పొదియ వెర్బన్‌కు అందజేశారు. ఈ అవార్డుల గ్రహీతలకు తలా రూ.2లక్షల నగదు, ఎనిమిది గ్రాముల స్వర్ణ పతకం, ప్రశంసాపత్రం అందజేసి సత్కరించారు. ఇదే విధంగా బీసీలు, ఓబీసీలు, మైనారిటీల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 2024 సంవత్సరానికిగాను పెరియార్ అవార్డును విడుదలై రాజేంద్రన్‌కు ఆదిద్రావిడ, గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంబేడ్కర్ అవార్డు డీపీఐ ఎంపీ రవికుమార్‌కు అందజేశారు. ఈ అవార్డు కింద రూ.5లక్షల నగదు, స్వర్ణపతకం, ప్రశంసాపత్రం అందజేశారు. సుప్రసిద్ధ తమిళ సాహితీవేత్త, రచయిత ముత్తువావాసికి కలైంజర్ అవార్డును అందజేశారు. ఈ అవార్డు కింద రూ.10లక్షల నగదు, స్వర్ణ పతకం, ప్రశంసాపత్రం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ముఖ్యమంత్రి ఉదయనిధి, తమిళభాషాభివృద్ధి, సమాచార శాఖ మంత్రి ఎం.పీ. సామినాథన్, బీసీల సంక్షేమ శాఖ మంత్రి శివ వీ మెయ్యనాథన్, ఆదిద్రావిడ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ఎం.మదివేందన్, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎన్.మురుగానందం, తమిళ భాషాభివృద్ధి, సమాచార శాఖల కార్యదర్శి వి. రాజారామన్ తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మంతోనే ఆధ్యాత్మిక భావాలు

- తిరువళ్లువర్‌పై మళ్లీ గవర్నర్ వివాదాస్పద వ్యాఖ్యలు

ప్యారీస్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మంతో ఆధ్యాత్మిక భావాలను వ్యాపింపజేసిన మహా పురుషుడు తిరువళ్లువర్ అని రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి కొనియాడారు. గవర్నర్ వ్యాఖ్యలు డీఎంకే, కాంగ్రెస్, డీపీఐ, ఏండీఎంకే తదితర పార్టీ నేతలకు తీవ్ర ఆగ్రహం తెప్పించాయి. మరోవైపు కాషాయ వస్త్రంతో రాజ్‌భవన్ ప్రాంగణంలో తిరువళ్లువర్ డే సందర్భంగా ఏర్పాటు చేసిన తిరువళ్లువర్ చిత్రపటానికి బుధవారం నివాళులర్పించిన గవర్నర్ మళ్లీ వివాదంలో చిక్కుకున్నారు. ఆయన తన ఎక్స్‌పేజీలో తిరువళ్లువర్‌ను కీర్తిస్తూ పోస్ట్ చేశారు. దానిని చూసిన పలు పార్టీలు గవర్నర్‌పై విరుచుకుపడ్డాయి. భారతదేశంలో సనాతన ధర్మం ఆచరించి తిరువళ్లువర్ ఆధ్యాత్మిక భావాన్ని ప్రజల్లో వ్యాపింపజేసిన మహానుభావుడని గవర్నర్ సోషల్ మీడియా వేదికగా కొనియాడారు. తిరుకురళ్ సూక్తులు సమాజానికి కనువిప్పు చేశాయని ఈ సూక్తులు ప్రపంచానికే ఆదర్శమని, అందువల్లే ప్రధాని నరేంద్ర మోదీ కూడా తిరువళ్లువర్‌ను ఆదర్శప్రాయంగా తీసుకున్నారని గవర్నర్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో డీఎంకే నేతృత్వంలోని మిత్ర పక్షాలు గవర్నర్ వైఖరిని తప్పుబట్టాయి. బాధ్యత గల పదవిలో వుంటూ, తమిళ భాషాభివృద్ధికి ఎనలేని కృషి చేసిన తిరువళ్లువర్‌కు సనాతన ధర్మంతో సంబంధాలున్నాయని వ్యాఖ్యానించడంపై ఖండించారు.



కాషాయ వస్త్రంతో ఉన్న తిరువళ్లువర్ చిత్రపటానికి గవర్నర్ ఆర్ఎన్ రవి నివాళి

ఈరోడ్ ఈస్ట్ ఎన్టీకే అభ్యర్థి సీతాలక్ష్మి

ఐసీఎఫ్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ ఈస్ట్ శాసన సభ నియోజకవర్గం ఉపఎన్నికలో నామ్ తమిళర్ కట్చి (ఎన్టీకే) తరఫున ఎంకే సీతాలక్ష్మి పోటీ చేయనున్నారని ఆ పార్టీ నేత సీమాన్ ప్రకటించారు. సీతాలక్ష్మి ఉపాధ్యాయినిగా 13 యేళ్లపాటు సేవలందించినట్లు తెలిపారు. ఈ నెల 17న ఆమె నామినేషన్ వేస్తారని ఆయన పేర్కొన్నారు.

సమాచార ధ్వని

పొంగల్ ప్రత్యేక రైళ్లు

పెరంబూర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం చెన్నై ఎగ్మూర్-మదురై-చెన్నై ఎగ్మూర్ మధ్య అన్ రిజర్వ్‌డ్ మెము రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

● నెం.06061 చెన్నై ఎగ్మూర్-మదురై అన్ రిజర్వ్‌డ్ మెము రైలు ఈ నెల 18వ తేది చెన్నై ఎగ్మూర్ నుంచి ఉదయం 10.45 గంటలకు బయల్దేరి రాత్రి 7.15 గంటలకు మదురై చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.06062 మదురై-చెన్నై ఎగ్మూర్ అన్ రిజర్వ్‌డ్ మెము రైలు ఈ నెల 19వ తేది మదురై నుంచి సాయంత్రం 4 గంటలకు బయల్దేరి అదే రోజు అర్ధరాత్రి 12.45 గంటలకు చెన్నై ఎగ్మూర్ చేరుకుంటుంది.

తపాలా శాఖ ఆధ్వర్యంలో 'ఉత్తరం' రాసే పోటీలు

పెరంబూర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): తపాలా శాఖ ఆధ్వర్యంలో తమిళం, ఆంగ్లం, హిందీ తదితర మూడు భాషల్లో ఉత్తరం రాయడంపై పోటీలు నిర్వహించనున్నారు. 'ప్రస్తుత కాలంలో ఉత్తరం ప్రాధాన్యత' అనే అంశంపై విద్యార్థులు సహా అన్ని వయస్సుల వారు పాల్గొనవచ్చు. ఇన్‌ల్యాండ్ లెటర్‌లో 500 వ్యాక్యాలు, 'ఏ4' పేపరులో 1,000 వాక్యాలు మించకుండా ఉండాలి. ఈ పోటీలకు రాష్ట్రస్థాయిలో మొదటి బహుమతిగా రూ.25,000,రెండవబహుమతిగా రూ.10,000, మూడవ బహుమతిగా రూ.5,000, దేశీయ స్థాయిలో రూ.50,000, రూ.25,000, రూ.10,000 అందించనున్నారు. తాము రాసిన ఉత్తరాలను 'ప్రధాన తపాల అధికారి, తమిళనాడు ప్రాంతీయ కార్యాలయం, చెన్నై-600002' అనే చిరునామాకు ఈ నెల 31వ తేదిలోగా పంపించాలని తపాలా శాఖ తెలిపింది.

గ్రామీణ రోడ్లకు రూ.804 కోట్లు

పెరంబూర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): గ్రామీణాభివృద్ధి, పంచాయతి శాఖ ఆధ్వర్యంలో రూ.804 కోట్లతో 746 రోడ్లు నిర్మించనున్నారు. ఈ మేరకు సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో... 2024-25 ఆర్థిక సంవత్సరంలో గ్రామీణాభివృద్ధి, పంచాయతి శాఖ ఆధ్వర్యంలో 37 జిల్లాల్లో 1,452.97 కి.మీ మేర 746 రోడ్ల నిర్మాణాలకు రూ.804.59 కోట్లు, ఐదేళ్లపాటు ఆ రోడ్ల నిర్వహణకు రూ.58 కోట్లు కేటాయిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసిందనిని, ఈ పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు సచివాలయం తెలియజేసింది.

మణిముత్తారులో స్నానాలకు నిషేధం

పెరంబూర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి జిల్లా అంబై సమీపంలోని పశ్చిమ కనుమల దిగువ భాగంలో ఉన్న మణిముత్తారు జలపాతం వద్ద పర్యాటకుల స్నానాలకు అటవీ శాఖ నిషేధం విధించింది. పశ్చిమ కనుమల్లో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఈ జలపాతం వద్ద వరద ప్రవాహం అధికంగా ఉంది. దీంతో, పర్యాటకుల భద్రత దృష్ట్యా జలపాతం వద్ద స్నానాలకు నిషేధించిన అటవీ శాఖ, జలపాతం చూసేందుకు మాత్రమే అనుమతించింది. కాగ, పొంగల్ సెలవులు కావడంతో కుటుంబాలతో జలపాతం వద్దకు వచ్చిన పర్యాటకులు నిరాశగా వెనుదిరిగారు.

20న రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అదనపు టోకెన్లు

పెరంబూర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): తై మాసంలో తొలి ముహూర్తపు రోజైన ఈ నెల 20వ తేది రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అదనపు టోకెన్లు ఇవ్వనున్నారు. 20వ తేదిన సాధారణంగా వంద టోకెన్లు ఇచ్చే కార్యాలయాల్లో 150 టోకెన్లు, 200 ఇచ్చే చోట 300 టోకెన్లు అందించనున్నారు. అలాగే, తత్కాల్‌లో 12 టోకెన్లు అందించనున్నట్లు, రద్దీ అధికంగా ఉండే కార్యాలయాల్లో అదనపు టోకెన్లు అందించనున్నట్లు రిజిస్ట్రేషన్ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

తిరువణ్ణామలైలో కోలాహలంగా 'తిరువూడల్' వేడుకలు

అడయార్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): అరుణాచలేశ్వరాలయంలో ఉత్తరాయణ పుణ్యకాల వేడుకలు ఈ నెల 5వ తేదీ ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా, బుధవారం తిరువూడల్ వేడుకను కోలాహలంగా నిర్వహించారు. వేకువజామునే స్వామివార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ఆ తర్వాత దక్షిణ మాడ వీధుల్లో ఊరేగించారు. తర్వాత భక్తులను స్వామి దర్శనానికి అనుమతిచ్చారు. భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో ప్రత్యేక దర్శనాన్ని అధికారులు రద్దు చేశారు. దేశంలోని శైవ క్షేత్రాల్లో తిరువూడల్ వేడుకను అత్యంత వైభవంగా నిర్వహించేది అరుణాచలం లోనే కావడం విశేషం.

గ్రామీణ కళాకారులకు రోజువారీ భత్యం పెంపు

అడయార్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని చెన్నై నగరంలో 'చెన్నై సంగమమ్' పేరుతో గ్రామీణ కళారూపాల ప్రదర్శన జరుగుతోంది. ఇందులోపాల్గొనే కళాకారులకు ఇచ్చే రోజువారీ భత్యాన్ని రూ.5 వేలకు పెంచారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి స్టాలిన్ తాజాగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ, చెన్నై సంగమమ్‌లో పాల్గొనే కళాకారులకు ఒక రోజు వేతనాన్ని రూ.5 వేలకు పెంచుతున్నట్టు ప్రకటించారు. చెన్నై నగరంలో మొత్తం 18 ప్రాంతాల్లో చెన్నై సంగమం జరుగుతోంది. ఇందులో పాల్గొనే కళాకారులకు ఒక రోజు భత్యంగా రూ.5 వేలతో పాటు బస కల్పించి, మూడు పూటల ఆహారం, రెండు జతల దుస్తులను అందజేయాలని ప్రభుత్వం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

పొల్లాచ్చిలో ఆకట్టుకున్న బెలూన్ ఫెస్టివల్

ఐసీఎఫ్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కోవై జిల్లా పొల్లాచ్చివద్ద ప్రారంభమైన 10వ అంతర్జాతీయ బెలూన్ ఫెస్టివల్‌కు రోజురోజుకూ స్పందన వస్తోంది. వింత ఆకారాలతో ఎగిరే అతి పెద్ద బెలూన్లు చూసేందుకు స్థానికులు తరలివెళ్లారు. ఈ వేడుకలలో అమెరికా, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, బ్రెజిల్, థాయ్‌లాండ్, వియత్నాం, బెల్జియం దేశాల నుంచి బెలూన్లను తెప్పించారు. మంగళవారం ఉదయం ప్రారంభమైన రెండో రోజు బెలూన్ ఫెస్టివల్‌కు కోయంబత్తూరు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు వెళ్లారు. ఉదయం నుండి సాయంత్రం దాకా మూడు కిలో



మీటర్ల ఎత్తున ఏనుగు ఆకారం, పులి ఆకారం, చిరుతపులి ఆకారంతో కూడిన బెలూన్లు ఎగిరాయి. సాయంత్రం ఆరు తర్వాత 50 మీటర్ల ఎగురవేసి ఈ బెలూన్లను దగ్గరగా వీక్షించేలా చేశారు.



వివిధ ప్రాంతాల నుంచి చెన్నైకు ప్రత్యేక బస్సులు

అడయార్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ కోసం తమ సొంతూళ్ళకు వెళ్ళిన వారు తిరిగి నగరానికి చేరుకునేందుకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి రాష్ట్ర రవాణా శాఖ ప్రత్యేక బస్సులను నడుపనుంది. ఈ పండుగ కోసం రాష్ట్ర రవాణా శాఖకు చెందిన బస్సుల్లో 8.72 లక్షల మంది ప్రయాణించినట్టు రవాణా శాఖ అధికారులు వెల్లడించారు. పొంగల్ వేడుకలు ముగియడంతో తిరిగి నగరానికి చేరుకునేవారికోసం రవాణా శాఖ ప్రధాన ప్రాంతాల నుంచి నగరానికి ప్రత్యేక బస్సులను నడిపేలా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా రోజూ నడిపే 2,092 బస్సులతో పాటు వచ్చే నాలుగు రోజుల పాటు 12,216 ప్రత్యేక బస్సులను నడుపనున్నట్టు ప్రకటించారు. బుధవారం అదనంగా 800 బస్సులను నడిపారు. అలాగే, చెన్నై మినహా ఇతర ప్రాంతాలకు 900 బస్సులను నడిపారు. అలాగే, వచ్చే రెండు మూడు రోజుల పాటు ఈ ప్రత్యేక బస్సులను నడుపనున్నట్టు రవాణా ఉన్నతాధికారులు ప్రకటించారు.

లెమన్ స్పూన్ పోటీల్లో కలెక్టర్ ఫస్ట్



లెమన్ స్పూన్ పోటీలో కలెక్టర్ గ్రేస్

పెరంబూర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పెరంబలూరు జిల్లా యంత్రాంగం, పర్యాటక శాఖ ఆధ్వర్యంలో సమత్తువ పొంగల్ వేడుకలు నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన పోటీల్లో పొంగుళ్లు పెట్టారు. అనంతరం నిర్వహించిన పలు క్రీడా పోటీల్లో ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు. క్రీడల్లో భాగంగా లెమన్ స్పూన్ పోటీల్లో మహిళలతో పాటు కలెక్టర్ గ్రేస్ లాలరిండికి పచౌ పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచారు. అనంతరం పోటీల్లో విజేతలకు కలెక్టర్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ వడివేలు ప్రభు సహా పలు శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

'గ్రీన్ స్కూల్' ప్రాజెక్ట్

● వంద పాఠశాలలకు రూ.20 కోట్లు

పెరంబూర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి హరిత తమిళనాడు పథకం లక్ష్యాల అమలు కోసం గ్రీన్ స్కూల్ ప్రాజెక్ట్ ప్రారంభించారు. ఆ ప్రకారం, 2022-2023, 2023-24 విద్యా సంవత్సరాల్లో 71 పాఠశాలలు గ్రీన్ స్కూల్స్‌గా ఎంపిక చేసి రూ.15 కోట్లతో పనులు చేపట్టారు. ఆ ప్రకారం, 2024-25 విద్యా సంవత్సరంలో వంద పాఠశాల్లో ఈ పథకం విస్తరించనున్నట్లు ఇటీవల శాసనసభ సమావేశాల్లో ప్రకటించారు. ఆ ప్రకారం, ఒక్కో పాఠశాలకు రూ.20 లక్షల చొప్పున రూ.20 కోట్లు కేటాయిస్తూ తమిళనాడు కాలుష్య నియంత్రణ మండలి నిధుల నుంచి పాఠశాల విద్యాశాఖకు నిధులు కేటాయిస్తూ ప్రభుత్వం జీవో జారీచేసింది.

రాష్ట్రంలో నడుస్తున్నది పోలీసు పాలనా...?

● పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి

పెరంబూర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నడుస్తుంది ప్రజా పాలనా? పోలీసు పాలనా? అంటూ పీఎంకే అధ్యక్షుడు డా.అన్బుమణి రాందాస్ ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో... విల్లుపరం జిల్లా అరసూరు జంక్షన్ రోడ్డులో పోలీసుల ఆగడాలు నిరసిస్తూ ఆందోళన చేపట్టిన ప్రజలపై పోలీసులు దాడిచేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇలాంటి ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెప్పే రోజులు త్వరలోనే రానున్నాయని అన్బుమణి తెలిపారు.

గగుర్పొడిచిన రక్తం చిందించే వేడుకలు

పెరంబూర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పొంగల్ సందర్భంగా ఈరోడ్ జిల్లాలో యువకులు చేసిన సంప్రదాయ వేడు కలు గగుర్పాటుకు గురిచేశాయి. పుంజై పులియంబట్టిలో ఉన్న రామలింగ చౌడేశ్వరి అమ్మవారి ఆలయం మంగళవారం ఈ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న యువకులు పాటలకు అనుగుణంగా నృత్యం చేస్తూ శరీరంపై కత్తులతో కొట్టుకున్నారు. చేనేత పరిశ్రమ అభివృద్ధి, లాభసాటిగా వ్యవసాయం సాగాలంటూ పారంపర్యంగా నిర్వహించే ఈ వేడుకల్లో చేనేత వృత్తులు చేసే కుటుంబాల యువకులు మాత్రమే పాల్గొనడం విశేషం.



కత్తులతో పొడుచుకుంటూ నృత్యం చేస్తున్న యువకులు

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

పెరంబూర్, జనవరి15(ఆంధ్రజ్యోతి): స్థానిక పల్లావరం సమీపం కవుల్ బజార్ పంచాయతి కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు నోటు పుస్తకాలు అందజేశారు. పీఎంకే ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి థామస్‌మలై పంచాయతి పార్టీ అధ్యక్షుడు కవుల్ బజార్ బాబు నేతృత్వం వహించారు. కార్యక్రమానికి ప్రత్యేక అతిథులుగా వెస్ట్ జిల్లా కార్యదర్శి కీల్‌కట్టలై ఇ.వెంకటేశన్, పసుమై తాయగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎన్.కన్నన్, వన్నియర్ సంఘం జిల్లా కార్యదర్శి మురసి రాజేంద్రన్ పాల్గొని, పిల్లలు నోటు పుస్తకాలు, పేనాలు అందజేశారు.



నోటు పుస్తకాలు అందజేస్తున్న నేతలు

రేపు ఎంజీఆర్‌కు ఈపీఎస్ నివాళి

పెరంబూర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే వ్యవస్థాపకుడు ఎంజీఆర్ 108వ జయంతి వేడుకలు శుక్రవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ పార్టీ ప్రధాన కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో... ఎంజీఆర్ 108వ జయంతి సందర్భంగా ఈ నెల 17వ తేది ఉదయం రాయపేటలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ఎంజీఆర్ విగ్రహానికి పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి నివాళులర్పించనున్నారని, ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని పార్టీ పిలుపునిచ్చింది.

నేడు అలంగానల్లూరు జల్లికట్టు

పారీస్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): తమిళుల సంప్రదాయ సాహస క్రీడలలో ప్రధానమైన 'జల్లికట్టు' ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందింది. ఈ పోటీల లో బహుమతులు గెలుచుకోవడం కంటే అందులో పాల్గొనడమే ఎద్దుల యజమానులు, యువకులు గొప్పగా భావిస్తుంటారు. పొంగల్ సందర్భంగా మదురై జిల్లాలో జల్లికట్టు పోటీలు నిర్వహించే ప్రాంతాల్లో పండుగ వాతావరణం సంతరించుకుంటుంది. అవనియాపురం, పాలమేడు, అలంగానల్లూరు ప్రాంతాల్లో నిర్వహించే జల్లికట్టు తిలకించేందుకు, స్వదేశీ, విదేశీ పర్యాటకులు ఉత్సాహం చూపుతుంటారు. గురువారం అలంగానల్లూరు జల్లికట్టు పోటీలను ఉపముఖ్యమంత్రి ఉదయనిధి ప్రారంభించి విజేతలకు ఉం గరాలు, బంగారు నాణేలను బహుమతిగా అందజేస్తారు. ఈ ఏడాది కూడా మంత్రులు, మాజీ మంత్రులు, ప్రముఖు ల ఎద్దులు అలంగానల్లూరు జల్లికట్టులో పాల్గొననున్నాయి. ఈ పోటీలకు వచ్చే ప్రేక్షకుల కోసం పెద్ద గ్యాలరీ ఏర్పాటు చేశారు. విదేశీ పర్యాటకులను తమిళనా డు టూరిజం కార్పొరేషన్ బస్సుల్లో అధికారులు అలంగానల్లూరు తీసుకువెళ్తారు. దీని కోసం ముందుగానే తమ పేర్లు నమోదుచేసుకున్న సుమారు 300 మంది పైగా విదేశీ పర్యాటకులు మంగళవారం మధ్యాహ్నం మదురై విమానాశ్రయానికి చేరుకోగా, వారిని రాష్ట్ర పర్యాటక శాఖ అధికారులు ఘనంగా స్వాగతించారు.



జల్లికట్టు కోసం ప్రత్యేక ఏర్పాట్లు

పళ్లిపట్టులో డీఎంకే సంక్రాంతి సందడి

● కార్యకర్తలకు కానుకలు అందించిన నాయకులు

తిరుత్తణి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పళ్లిపట్టు ఆర్కేపేట డీఎంకే కార్యాలయంలో సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో పండుగ సందర్భంగా ఆర్కేపేట డీఎంకే పార్టీ శ్రేణులకు నాయకులు పండుగ కానుకలు పంపిణీ చేశారు. అదేవిధంగా పొదటూర్‌పేటలో నిర్వహించిన కార్యక్రమంలో తిరువళ్లూరు జిల్లా కార్యదర్శి, తిరుత్తణి ఎమ్మెల్యే ఎస్.చంద్రన్ కార్యకర్తలకు కానుకలు అందజేశారు. అనంతరం జిల్లా క్యాలెండర్‌ను ఆవిష్కరించి, పార్టీ శ్రేణులకు నూతన వస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు ఉదయ సూర్యన్, జంగాళపల్లె గోపి, నాగలింగం, శివానందం తదితరులు పాల్గొన్నారు.



ఉత్సాహంగా గుర్రపు పందేలు



జెండా ఊపి పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు రాజేంద్రన్, చంద్రన్ తదితరులు

తిరుత్తణి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి జన్మదినం, పొంగల్ సందర్భంగా నిర్వహించిన గుర్రపు పందేలు కోలాహలంగా జరిగాయి. తిరువళ్లూర్ పశ్చిమ జిల్లాలోని తిరువాలంగోడు తూర్పు యూనియన్ డీఎంకే ఆధ్వర్యంలో బుధవారం ఈ పోటీలు జరిగాయి. కార్యక్రమానికి కేంద్ర డీఎంకే కార్యదర్శి ఎస్.మహాలింగం అధ్యక్షత వహించగా, మాజీ కౌన్సిలర్ నందకుమార్ స్వాగతం పలికారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యేలు వీజీ రాజేంద్రన్, చంద్రన్‌లు పాల్గొని పోటీలు ప్రారంభించారు. బిగ్ హార్స్, మీడియం హార్స్, స్మాల్ హార్స్ అని విభాగాల్లో 4 కి.మీ మేర నిర్వహించిన పోటీల్లో, మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన గుర్రపు డ్రైవర్లు, గుర్రపు యజమానులకు బహుమతులు అందజేశారు.

పుదువైలో మార్చి నాటికి 'స్మార్ట్ సిటీ' పనుల పూర్తి

పారీస్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర పాలిత రాష్ట్రం పుదుచ్చేరిలో స్మార్ట్ సిటీ పథకం పనులు మార్చి నాటికి పూర్తి కానున్నట్లు ఆ ప్రాజెక్టు సీఈవో జయంత్‌కుమార్ పేర్కొన్నారు. పుదుచ్చేరి కుమరగురుపల్లం ప్రాంతంలో జరుగుతున్న స్మార్ట్ సిటీ పనులను బుధవారం పరిశీలించిన సందర్భంగా జయంత్‌కుమార్ మాట్లాడుతూ, పుదుచ్చేరి ప్రభుత్వం స్మార్ట్ సిటీ పథకం కింద 82 పథకాలకు రూ.1,056 కోట్ల నిధులు కేటాయించిందని, వీటిలో ఇప్పటి వరకు 57 పనులు పూర్తికాగా, మిగిలిన 25 పనులు వచ్చే మార్చి నాటికి పూర్తైయ్యేలా పనులు వేగవంతం చేసినట్లు తెలిపారు. అదే విధంగా రూ.30 కోట్లతో నిర్మిస్తున్న ప్రభుత్వ రవాణా కార్యాలయం, బస్ స్టేషన్లు కూడా త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి వస్తాయన్నారు.



గృహ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అధికారులు

కన్యకా పరమేశ్వరి ఆలయంలో గోపూజ



గోపూజలో ఎస్కేపీడీ ట్రస్టీలు, భక్తులు

పారీస్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక జార్జ్ టౌన్‌లోని కన్యకా పరమేశ్వరి దేవస్థానం (ఎస్కేపీడీ)లో బుధవారం కనుమ పండుగ సందర్భంగా గోపూజ నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న గోశాలలో సంరక్షిస్తున్న పాడిపశువులకు పొంగలి నైవేద్యంగా పెట్టారు. ఆలయ ప్రధాన అర్చకులు భాస్కరపంతుల బృందంచే నిర్వహించిన గోపూజలో ఎస్కేపీడీ ట్రస్టీలు ఊటుకూరు శరత్‌కుమార్, దేసు లక్ష్మీనారాయణ, కిషోర్‌బాబు, బద్రినారాయణ, మాజీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పొలంలో పడిన 'ఏనుగు బెలూన్'

చెన్నై, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పొంగల్‌పండుగ సందర్భంగా కోయంబత్తూరు జిల్లా పొల్లాచ్చి పట్టి మైదానంలో రాష్ట్ర పర్యాటక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ బెలూన్ల పండుగలో అపశ్రుతి జరిగింది మంగళవారం ఉదయం ప్రారంభమైన ఈ పోటీలలో ఫ్రాన్స్, బ్రెజిల్, వియత్నాం సహా ఎనిమిది దేశాల నుండి తెప్పించిన ఏనుగు, పులి, ఎలుగుబంటి, ఎద్దు తదితర ఆకారాల పెద్ద పెద్ద బెలూన్లను ఎగురవేశారు. . ఆ సందర్భంగా ఏనుగు ఆకారంలో ఉన్న బెలూన్ ఎగిరింది. ఇందులో విదేశీ ఆడ, మగ పైలెట్లు, వారితో ఇద్దరు బాలికలు ప్రయాణించారు. ఆచ్చిపట్టి మైదానం నుండి 3. కి.మీ. వరకు ఆకాశంలో ఎగిరిన తర్వాత కిందకు దింపాలని అనుకున్నారు. అయితే ఉన్నట్టుండి గాలి వేగం అధికం కావటంతో ఆ బెలూను దిశ తప్పి 30 కి.మీ.ల మేర ప్రయాణించి కేరళ రాష్ట్రం కన్నిమారి ముల్లతట్టు అనే ప్రాంతంలోని పంటపొలంలో దిగింది. అదృష్టవశాత్తూ ఆ బెలూన్‌లో ప్రయాణించిన నలుగురికి ఎలాంటి ప్రాణాపాయం కల గలేదు. స్థానికులు పొలంలో పడిన బెలూన్‌ను చూసేందుకు వచ్చారు. ఆలోగా బెలూన్ ఫెస్టివల్ నిర్వాహకులు ఆ ప్రాంతానికి హుటాహుటిన చేరుకుని బెలూన్‌లో చిక్కుకున్న నలుగురిని వెలికి తీశారు.



పంటపొలంలో కూలిపడిన ఏనుగు బెలూన్

పొదిగై ఎక్స్‌ప్రెస్‌పై రాళ్ల దాడి

పెరంబూర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పొదిగై ఎక్స్‌ప్రెస్‌పై రాళ్లతో దాడి చేసిన వ్యక్తి కోసం పోలీసులు గాలిస్తున్నారు. చెన్నై ఎగ్మూర్ నుంచి మంగళవారం రాత్రి సెంగోట్టైకు పొదిగై ఎక్స్‌ప్రెస్ బయల్దేరగా, విల్లుపురం సమీపంలో బి-2 ఏసీ బోగీపై గుర్తుతెలియని వ్యక్తులు రాళ్లు రువ్వారు. ఈ ఘటనలో ఓ కిటికీ అద్దాలు బీటలుబారాయి. దిగ్భ్రాంతి చెందిన ప్రయాణికులు రైల్వే అధికారులకు సమాచారం అందించారు. రాత్రి 10.30 గంటలకు విల్లుపురం చేరుకున్న రైలును అధికారులు పరిశీలించి, బీటలుబారిన కిటికీకి మరమ్మతులు చేపట్టడంతో, కొద్ది నిమిషాలు ఆలస్యంగా రైలు బయల్దేరి వెళ్లింది. ఈ ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదుచేసి, రాళ్లు రువ్విన ఆగంతకుల కోసం గాలిస్తున్నారు.

పట్టాలు తప్పిన విల్లుపురం ప్యాసింజర్

పెరంబూర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): విల్లుపురంలో ప్యాసింజర్ రైలు పట్టాలు తప్పిన ఘటనలో ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. విల్లుపురం నుంచి పుదుచ్చేరి వెళ్లే ప్యాసింజర్ రైలు మంగళవారం సాయంత్రం విల్లుపురం నుంచి బయల్దేరిన కొన్ని నిముషాల్లోనే పట్టాలు తప్పింది. దీనిని గమనించిన లోకోపైలట్ సత్వరం రైలును నిలిపివేయడంతో పెనుప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న అధికారులు, సిబ్బంది అక్కడకు చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ప్రతిరోజు 500 మందితో వెళ్లే ఈ రైలులో సంక్రాంతి సెలవు కావడంతో 60 మంది మాత్రమే ప్రయాణిస్తున్నారని, ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరుగలేదని, ప్రయాణికులను దాదర్-పుదుచ్చేరి రైలులో పంపినట్లు దక్షిణ రైల్వే ప్రకటనలో తెలిపింది..

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట రూ.34 లక్షల మోసం

పెరంబూర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ట్రేడింగ్‌తో రూ.34 లక్షలు మోసం చేసిన ముఠా కోసం సైబర్ క్రైం పోలీసులు విచారిస్తున్నారు. కోయంబత్తూర్ ఇడయర్‌పాళయం కుమారన్ నగర్ ప్రాంతానికి చెందిన మోనీషా ఆన్‌లైన్ ట్రేడింగ్ కోసం గూగుల్‌లో సెర్చ్ చేశారు. ఆమె వాట్సాప్ నెంబరును 'రాట్విన్ స్టడీ గ్రూప్ అండ్ కోడ్' అనే గ్రూప్‌లో గుర్తుతెలియని వ్యక్తులు యాడ్ చేశారు. అనంతరం ఆమె వాట్సాప్‌కు నకిలీ షేర్ మార్కెట్ యాప్ పంపించారు. అందులో, ముఖ్యమైన సంస్థల షేర్లు, వాటి కొనుగోలు, విక్రయాలు, కొత్తగా ఐపీఓ విడుదల చేసిన సంస్థల వివరాలు తదితరాలున్నాయి. మోనీషాను సంప్రదించిన వ్యక్తులు, షేర్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టి లాభాలు పొందవచ్చని నమ్మించారు. వారి మాటలు నమ్మిన మెనీషా, వారు తెలిపిన పలు బ్యాంక్ ఖాతాలకు రూ.34.48 లక్షలు పంపించారు. అనంతరం మోనీషా వారు పంపిన యాప్ ద్వారా ట్రేడింగ్ ప్రారంభించింది. ట్రేడింగ్ ద్వారా వచ్చిన లాభాలు కూడా యాప్‌లో కనిపించాయి. ఒకానొక సమయంలో రూ.50 లక్షలున్నట్లు యాప్‌లో మోనీషా గుర్తించి, ఆ నగదు తీసుకొనేందుకు యత్నించగా, మరికొంత నగదు చెల్లిస్తేనే ఈ నగదు తీసుకొనేందుకు వీలవుతుందని తెలిపారు. దీంతో, తాను మోసపోయినట్లు గుర్తించిన మెనీషా, కోవై నగర సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ వ్యవహారంపై పోలీసులు విచారణ చేపట్టారు.

పండుగ పూట విషాదం

నదిలో స్నానానికి వెళ్లిన వ్యక్తి మృతి

పారీస్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): నదిలో స్నానానికి వెళ్లిన ఓ వ్యక్తి నీటి ఉధృతిపెరగడంతో నీటిలో కొట్టుకుపోయి మృతిచెందిన ఘటన తంజావూరులో చోటుచేసుకుంది. తంజావూరు జిల్లా మేలట్టూరు గ్రామానికి చెందిన సౌందరరాజన్ (39) తిరుప్పూర్‌లోని ఓ కంపెనీలో పని చేస్తున్నాడు. పండుగ సందర్భంగా తన భార్య శరణ్య సొంతూరు తంజావూరుకు తన కుమార్తెలు నితీషా(12), నివేద(14)తో కలిసి గత ఆదివారం వెళ్లాడు. కుటుంబ సభ్యులతో కలిసి సౌందరరాజన్ పండుగ జరుపుకున్నాడు. మంగళవారం సాయంత్రం తంజావూరులోని కావేరి నదికి కుటంబాన్ని తీసుకొని వెళ్లాడు. ఈ నేపథ్యంలో తన పిల్లలతో నీటిలో దిగిన సౌందరరాజన్, కొంత సేపటికి నది ఉధృతి పెరుగుతుండటంతో వెనక్కి వచ్చేయమని కుమార్తెలు పిలవగా బయటకు వచ్చే క్రమంలో నీటి ఉధృతి పెరిగి ఆ ప్రవాహంలో సౌందరరాజన్ కొట్టుకుపోయాడు. పిల్లలు కేకలు వేస్తూ కుటుంబ సభ్యులకు చెప్పగా, వారు స్థానికులతో అతడిని కాపాడే ప్రయత్నం చేశారు. కాని ఈ లోపే అతను ఊపిరాడక మృతిచెందాడు. ఆనందంతో జరుపుకొనే పండుగ వారి కుటుంబంలో విషాదాన్ని మిగిల్చింది.

ఏనుగు దాడిలో వృద్ధుడి మృతి

పెరంబూర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ జిల్లా సత్యమంగళం పులుల శరణాలయంలో ఏనుగు దాడిలో వృద్ధుడు మృతిచెందాడు. కట్టాడి గిరిజన గ్రామానికి చెందిన మాదేవప్ప (65) తన ముగ్గురు స్నేహితులతో కలసి మంగళవారం కట్టెలకోసం అడవిలోకి వెళ్లాడు. మాదేవప్ప పసుమేశ్వరన్ ఆలయ ప్రాంతంలో కట్టెలు సేకరిస్తుండగా, మిగిలిన వారు మరో ప్రాంతంలో ఉన్నారు. ఎంతసేపటికి మాదేవప్ప రాకపోవడంతో స్నేహితులు, ఆ ప్రాంతానికి వెళ్లి చూడగా రక్తపుమడుగుల్లో మృతిచెందిన మాదేవప్పను గుర్తించారు. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు అక్కడకు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి, అతను ఏనుగు దాడిలో మృతిచెందినట్లు నిర్ధారించి, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థినిపై లైంగిక వేధింపులు

● యూపీకి చెందిన బేకరి కార్మికుడి అరెస్టు

చెన్నై, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోట్టూరుపురంలో ఐఐటీ మద్రాస్ విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన బేకరీ కార్మికుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఐఐటీ ప్రాంగణంలోని హాస్టల్‌లో ఉంటున్న ఆ విద్యార్థిని మంగళవారం కోట్టూరుపురం బేకరీ దగ్గరకు టీ తాగటానికి వెళ్ళింది. ఆ సమయంలో షాపులో పనిచేస్తున్న యువకుడు ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ లైంగికవేధింపులకు పాల్పడ్డాడు. హద్దుమీరి ప్రవర్తించడంతో ఆ విద్యార్థిని వెంటనే కోట్టూరుపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు అక్కడికి చేరుకుని బేకరీలో పనిచేస్తున్న ఉత్తర ప్రదేశ్‌కు చెందిన శ్రీరామ్ (29) అనే యువకుడిని అరెస్టు చేశారు. పోలీసులు ప్రశ్నించగా ఆ యువకుడు తన నేరాన్ని అంగీకరించాడు. అతడిని మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచి జైలుకు తరలించారు.

విదేశీయురాలి నుంచి జీపీఎస్ పరికరం స్వాధీనం

అడయార్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక మీనాంబాక్కంలోని చెన్నై విమానాశ్రయంలో స్విట్జర్లాండ్ మహిళ వద్ద నిషేధిత జీపీఎస్ పరికరాన్ని ఎయిర్‌పోర్టు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే, ఆమె ప్రయాణాన్ని రద్దు చేసి ఆమెను విచారిస్తున్నారు. చెన్నై నుంచి దుబాయ్ మీదుగా స్విస్‌కు వెళ్ళేందుకు ఓ మహిళ ఎయిర్‌పోర్టుకు రాగా, ఆమెను భద్రతాధికారుల తనిఖీల్లో జీపీఎస్ పరికరాన్ని గుర్తించారు. దీంతో అధికారులు ఆమె ప్రయాణాన్ని రద్దు చేసి, ఆ పరికరాన్ని కూడా స్వాధీనం చేసుకున్నారు. స్విస్ నుంచి భారత్‌కు పర్యాటకురాలిగా వచ్చానని, ఏ విమానాశ్రయంలో కూడా కూడా జీపీఎస్ పరికరాన్ని భద్రతా అధికారులు వద్దని చెప్పలేదన్నారు. అయితే, ఎయిర్‌పోర్టు అధికారులు ఆమెను అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు.

కనుమ పండుగ రోజు విషాదం

నీటిగుంటలో పడి ఇద్దరు చిన్నారుల మృతి



మృతులు ప్రదీప్‌రాజా, శ్రీ కవి (ఫైల్‌ఫోటో)

పెరంబూర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): తాము పెంచుకునే పశువులను స్నానం చేయించేందుకు తీసుకెళ్లిన ఇద్దరు చిన్నారులు నీటమునిగి మృతిచెందిన ఘటన విషాదం నింపింది. కనుమ పండుగ రోజున రైతులు తాము పెంచుకుంటున్న పశువులకు స్నానాలు చేయించి, అలంకరించి పూజలు చేస్తారు. ఈ నేపథ్యంలో, సేలం జిల్లా రాకిపట్టి గ్రామానికి చెందిన శంకర్ కుమార్తె శ్రీకవి (14), అదే ప్రాంతానికి చెందిన మహేష్‌కుమార్ కుమారుడు ప్రదీప్‌రాజా (9) తమ పశువులను తీసుకొని సమీపంలో కుంట వద్దకు వెళ్లారు. వారితో పాటు శ్రీకవి తాత రాజేంద్రన్ కూడా ఉన్నాడు. గుంటలో పశువులను స్నానం చేస్తున్న శ్రీకవి, ప్రదీప్‌రాజా హఠాత్తుగా కాలుజారి నీటిలో పడిపోయారు. అది చూసి తాత రాజేంద్రన్ కేకలతో చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకొని గుంటలో గాలించి ఇద్దరి మృతదేహాలు వెలికితీశారు. కనుమ పండుగ రోజున ఇద్దరు చిన్నారులు మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.


వెట్రిమారన్, ఎస్.థాను, సూర్య

నాలుగేళ్ళ తర్వాత మళ్ళీ పట్టాలెక్కనున్న 'వాడివాసల్'

సూర్య హీరోగా, వెట్రిమారన్ దర్శకత్వంలో ప్రముఖ నిర్మాత కలైపులి ఎస్.థాను నిర్మించే చిత్రం 'వాడివాసల్' నాలుగేళ్ళ తర్వాత మళ్ళీ పట్టాలెక్కనుంది. 2021 జూలై 16న ఈ ప్రాజెక్టుపై అధికారిక ప్రకటన వెలువడింది. ఆ తర్వాత 2022 మార్చిలో టెస్ట్ షూట్ నిర్వహించి కొన్ని అప్‌డేట్స్ వెల్లడించారు. ఆ యేడాదిలోనే సెట్స్‌పైకి తీసుకెళ్లనున్నట్టు ప్రకటించారు. కానీ, దర్శకుడు వెట్రిమారన్ 'విడుదలై' ప్రాజెక్టులో బిజీ కావడంతో ఈ చిత్రానికి జాప్యం నెలకొంది. ఒక దశలో 'వాడివాసల్' ప్రాజెక్టుకు అటకెక్కించారని, మరోమారు, హీరో సూర్య స్థానంలో ధనుష్ నటించనున్నారనే ప్రచారం కూడా జరిగింది. ఈ నేపథ్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా బుధవారం నిర్మాత కలైపులి ఎస్.థాను శుభవార్త ప్రకటించారు. 'అఖిలాండం ఆరాధించే వాడివాసల్ తెరుచుకోనుంది' అంటూ ట్వీట్ చేశారు. దీంతో నాలుగుళ్ళ తర్వాత ఈ సినిమాను మళ్ళీ సెట్స్‌పైకి తీసుకెళ్ళేందుకు చిత్ర బృందం సిద్ధమవుతుంది. కాగా, ఈ సినిమా కోసం హీరో సూర్య జల్లికట్టు ఎద్దులతో శిక్షణ పొందిన విషయం తెల్సిందే.

సంక్రాంతి సంబరాల్లో తారలు



భార్యాపిల్లలతో శివకార్తికేయన్ - నయనతార - విగ్నేష్ దంపతులు



సంతానం సూర్య నమస్కారం



పొంగలి వండుతున్న సాక్షి అగర్వాల్ - అశోక్ సెల్వన్ - కీర్తి పాండియన్ - కీర్తి సురేష్ దంపతులు

కోలీవుడ్‌కు చెందిన సినీ ప్రముఖులు సంక్రాంతి వేడులను ఘనంగా జరుపుకున్నారు. పొంగల్ వేడుకల్లో భాగంగా తొలి రోజున తమ తమ లోగిళ్ళలో భోగి మంటలు వేశారు. రెండో రోజైన మకర సంక్రాంతి పండుగ రోజున పొంగలి తయారు చేసి తమ ఇష్టదైవాలను ప్రార్థించారు. కొత్తగా వివాహం చేసుకున్న హీరోయిన్లు తమ భర్తతో కలిసి కొత్త కుండలో పొంగలి తయారు చేశారు. కనుమ పండుగ రోజైన బుధవారం పశువులకు పూజలు చేశారు. ఇటీవల వివాహం చేసుకున్న హీరోయిన్ కీర్తి సురేస్ ఇంట జరిగిన పొంగల్ వేడుకల్లో అగ్రహీరో విజయ్ పాల్గొని పొంగల్ తయారుచేశారు. అలాగే, సంక్రాంతి వేడుకలను జరుపుకున్న అనేక మంది సినీ సెలెబ్రిటీలు తమ ఫొటోలను ఇన్‌స్టాఖాతాలో షేర్ చేశారు.


కీర్తి సురేష్ ఇంట జరిగిన పొంగల్ వేడుకల్లో విజయ్

పొంగల్ విజేత 'మద గజ రాజా'


'మద గజ రాజా'లో విశాల్ వరలక్ష్మి, అంజలి

ఈ యేడాది పొంగల్‌కు విడుదలైన చిత్రాల్లో విశాల్ - సంతానం నటించిన 'మద గద రాజా' మూవీ సూపర్ హిట్ టాక్‌తో నిలిచింది. సుందర్ దర్శకత్వం వహించిన ఈ మూవీ ఈ నెల 12వ తేదీ విడుదలైంది. 10వ తేదీ అరుణ్ విజయ్ నటించిన 'వణంగాన్', 'మద్రాస్ కారన్', 14న 'కాదలిక్క నేరమిల్లై', 'నేసిప్పాయా', 'తరుణం' మూవీలు విడుదలయ్యాయి. వీటితోపాటు శంకర్ - రామ్ చరణ్ హీరోగా నటించిన పాన్ ఇండియా మూవీ 'గేమ్ ఛేంజర్' మూవీ కూడా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే, ఈ పొంగల్‌కు విడుదలైన ఆరు స్ట్రైట్ తమిళ చిత్రాల్లో ప్రేక్షకులు విశాల్ 'మద గజ రాజా' మూవీకి ఫుల్ మార్కులు వేశారు. 12 యేళ్ళ తర్వాత వచ్చిన తర్వాత కూడా ఈ సినిమా ప్రేక్షకాదారణ పొందడం గమనార్హం. ఈ సినిమా విడుదలైన తొలి మూడు రోజుల్లోనే రూ.10 కోట్లకు పైగా వసూలు చేసినట్టు కోలీవుడ్ ట్రేడ్ వర్గాల సమాచారం. ముఖ్యంగా తొలి రోజు కలెక్షన్ల కంటే ఆ తర్వాత రెండు రోజుల కలెక్షన్లు అధికంగా ఉన్నాయి. దీనికి తోడు ఈ సినిమాను ప్రదర్శించే థియేటర్ల సంఖ్య కూడా క్రమంగా పెంచుతుండటం గమనార్హం. ఆది వారం వరకు సెలవులు కావడంతో ఈ సినిమా కలెక్షన్లు భారీగా పెరిగే అవకాశం ఉంది. మొత్తంమీద ఈ యేడాది పొంగల్ విజేతగా ఈ సినిమా నిలిచిందని సినీ ట్రేడ్ వర్గాలు పేర్కొంటున్నాయి.

గూస్‌బంప్స్ తెప్పిస్తున్న 'జైలర్-2' టీజర్

తమిళ చిత్రజ్యోతి


'జైలర్-2'లో రజనీకాంత్

యంగ్ డైరెక్టర్ నెల్సన్ దిలీప్ కుమార్, సూపర్‌స్టార్ రజనీకాంత్ కాంబినేషన్‌లో గతంలో వచ్చిన 'జైలర్'కు రెండో భాగం రానుంది. పొంగల్‌ను పురస్కరించుకుని అనౌన్స్‌మెంట్ టీజర్‌ను మంగళవారం రాత్రి విడుదల చేశారు. 'హుకుం..' సాంగ్‌తో ప్రారంభమైన ఈ టీజర్ గూస్‌బంప్స్ తెప్పిస్తుంది. ప్రస్తుతం ఈ టీజర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్టుకు సంబంధించి ప్రీప్రొడక్షన్ పనులు కూడా పూర్తయినట్టు తెలుస్తుంది. కాగా, గతంలో వచ్చిన 'జైలర్' బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచింది. రజనీకాంత్‌కు చాలా యేళ్ళ తర్వాత ఒక కమర్షియల్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. దాదాపు రూ.600 కోట్ల వరకు కలెక్షన్లు రాబట్టింది. ఈ సినిమాకు సీక్వెల్ వస్తుందా? రాదా? అనే సందేహానికి తెరదించుతూ అధికారికంగా ప్రకటించారు. ఈ టీజర్‌లో దర్శకుడు నెల్సన్, సంగీత దర్శకుడు అనిరుధ్ కలిసి నటించారు. ఓ యాక్షన్ బ్లాక్‌తో టీజర్‌ను కట్ చేశారు. కాగా, రజనీకాంత్ ప్రస్తుతం లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో 'కూలీ' మూవీలో నటిస్తున్న విషయం తెల్సిందే.


ఎగ్మూర్ మ్యూజియం ప్రాంగణంలో జరుగుతున్న మేళాలో మదురై ఇండియన్ డాన్స్ గ్రూప్ గ్రామీణ నృత్యం



కోయంబేడు జయ నగర్ పార్క్ మేళాలో కలైమామణి మడపుప్పం కరుప్పయ్య బృందం ప్రదర్శన - గిండి కత్తిపారలో...


నుంగంబాక్కం కార్పొరేషన్ మైదానంలో జరుగుతున్న మేళాలో కడలూరు రేణుకాంబాళ్ బృందం ప్రదర్శన

'చెన్నై సంగమం'కు విశేష ఆదరణ

- భారీగా తరలివస్తున్న జనం
- నాలుగు ప్రాంతాల్లో ప్రత్యక్ష ప్రసారం

పెరంబూర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): జానపద కళల్ని, గ్రామీణ కళాకారుల్ని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'చెన్నై సంగమం'కు విశేష ఆదరణ లభిస్తోంది. ఈ కళా ప్రదర్శనలు తిలకించేందుకు ప్రజలు భారీగా తరలివస్తున్నారు. దీంతో స్థలాభావం కారణంగా నగరంలోని నాలుగు ప్రాంతాల్లో 'చెన్నై సంగమం' సాంస్కృతిక మేళాను ఎల్ఈడీ స్క్రీన్‌తో కూడిన వాహనాల ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు. ఈ మేరకు సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో... చెన్నై సంగమం సాంస్కృతిక మేళాను ఈ నెల 13వ తేది ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించగా, మరుసటిరోజు నుంచి నగరవ్యాప్తంగా 18 ప్రాంతాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో, మెరీనా బీచ్, కోయంబేడు సబర్బన్ బస్ టెర్మినల్స్, కిలంబాకం కలైంజర్ సెంటినరీ బస్ టెర్మినల్, మాధవరం బస్ టెర్మినల్ ప్రాంతాల్లో ఈ నెల 17వ తేది వరకు సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు ఎల్ఈడీ స్క్రీన్ల ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు సమాచార శాఖ తెలియజేసింది.



స్థానిక కీల్పాక్కం ఏకాంబరనాథ ఆలయ మైదానంలో మంగళవారం రాత్రి సాంస్కృతిక మేళా వీక్షిస్తున్న ఎంపీ కనిమొళి



టి.నగర్ నటేశన్ పార్కులో కోవై మురుగన్ డప్పుల ప్రదర్శన - పెరంబూర్ మురసోలిమారన్ పార్కులో..


కేకే నగర్ శివన్ పార్కులో...

బృహదీశ్వరాలయ నందీశ్వరుడికి కూరగాయలతో అలంకారం


విశేషాలంకారంలో నందీశ్వరుడు

చెన్నై, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తంజావూరు బృహదీశ్వరాలయంలోని నందీశ్వరుడికి బుధవారం పశువుల పండుగను పురస్కరించుకుని కూరగాయలతో అలంకరించారు. యేటా పశువుల పండుగ రోజున ఆ విగ్రహాన్ని కూరగాయలతో అలంకరిస్తారు. సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా కనుమ పండుగ రోజు బుధవారం నందీశ్వరుడిని కూరగాయలు, మిఠాయిలు, పాలకోవా, పుష్పాలతో అలంకరించారు. ఆ తర్వాత నందీశ్వరుడికి 16 రకాలైన దీపారాధన చేశారు. ఈ సందర్భంగా ఆ నందీశ్వరుడి విగ్రహం ఎదుట 108 పశువులను నిలబెట్టారు. వాటికి చందనం, కుంకుమతో తాపడం చేసి గోపూజ జరిపారు. చివరగా నందీశ్వరుడికి నైవేద్యంగా సమర్పించిన కాయగూరలు, పండ్లు, స్వీట్లను భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేశారు.

కున్నూరు పొంగల్ వేడుకల్లో విదేశీయుల సందడి


పొంగల్ వేడుకల్లో నృత్యం చేస్తున్న ఆంగ్లేయులు

చెన్నై, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా కున్నూరు డెంట్ హిల్ ప్రాంతంలో నిర్వహించిన పొంగల్ వేడుకల్లో ఆంగ్లేయులు పాల్గొని సందడి చేశారు. పవిత్రజలాల కలశాలతో డప్పులు, మంగళ వాయిద్యాల నడుమ స్థానికులు, విదేశీయులు ఆడుతూపాడుతూ ఊరేగింపుగా బయలుదేరారు. పాల్‌కిలవా, కోర్టు, లెవల్ క్రాస్, మౌంట్ రోడ్ మీదుగా డెంట్‌హిల్ కొండపై అమ్మవారికి ఆలయం వరకు ఈ ఊరేగింపు జరిగింది. ఆ తర్వాత కరగాట్టం, ఒయిలాట్టమ్, మయిలాట్టం వంటి జానపదనృత్య ప్రదర్శనలు కూడా జరిగాయి. చివరగా తంది మారియమ్మన్ ఊరేగింపు నిర్వహించారు. ఈ వేడుకలకు లండన్ నుండి పది మందికి పైగా ఆంగ్లేయులు విచ్చేశారు. వీరికి స్థానిక ప్రముఖులు వేసి ఆహ్వానించారు. ఆ తర్వాత స్థానికులతో పాటు పొంగల్ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లండన్‌కు చెందిన ఛార్లెస్ మాట్లాడుతూ తమిళ సంస్కృతీ సంప్రదాయాలంటే తమకెంతో ఇష్టమని, తమిళలంతా జరుపుకునే ఈ పెద్ద పండుగ (పొంగల్) వేడుకల్లో పాల్గొనేందుకే వచ్చామని చెప్పారు.

తిరుత్తణిలో ప్రత్యేక పూజలు

తిరుత్తణి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి చెందిన మురుగన్ క్షేత్రాల్లో ఐదవదైన తిరుత్తణి సుబ్రమణ్యస్వామి ఆలయంలో ఏడాదికి ఒకసారి వచ్చే త్రైమాసంలోని మొదటి రోజు ప్రాముఖ్యత సంతరించుకుంది. పొంగల్ పండుగను పురస్కరించుకొని, కొత్త మట్టికుండలో పవిత్ర జలాన్ని తీసుకొని, ఊరేగింపుగా మంగళవాయిద్యాలతో వేదమంత్రాల నడుమ కొండపైన ఆలయానికి చేరుకున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు మురుగన్‌కు పవిత్ర జలంతో, ఆ తర్వాత సుగంధ ద్రవ్యాలతో కూడిన అభిషేకం చేశారు. అనంతరం ఆభరణాలతో స్వామి వారిని అలంకరించారు.ఈ వేడుక తిలంకించేందుకు దక్షిణాది రాష్ట్రాల నుండి వేల సంఖ్యలో భక్తులు వచ్చారు.




తిరువళ్లువర్ దినం సందర్భంగా చెన్నై మెరీనాబీచ్ కామరాజర్‌రోడ్డులోని ఆయన విగ్రహం వద్ద చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, డిప్యూటీ ముఖ్యమంత్రి ఉదయనిధి, మేయర్ ఆర్. ప్రియ, మంత్రులు, అధికారులు



గిండి రాజ్‌భవన్‌లో తిరువళ్లువర్ దినం సందర్భంగా ఆయన విగ్రహం దిగువ ఉంచిన చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి

పాలమేడులో రంకెలేసిన పోట్లగిత్తలు


పోటీని ప్రారంభిస్తున్న మంత్రి మూర్తి

చెన్నై, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మదురై జిల్లా పాలమేడులో బుధవారం నిర్వహించిన జల్లికట్టు విన్యాసాలు అటు క్రీడాకారులకు, ఇటు ప్రేక్షకులకు గగుర్పాటు కలిగించింది. వాడివాసల్ నుండి బయటకు వచ్చే ఎద్దులు కొన్ని తమను అణచివేయడానికి నిలిచిన యువకుల కళ్లుగప్పి మైదానం కేసి పరుగెత్తాయి. ఎవరికీ చిక్కకుండా పరుగెత్తుకొస్తున్న తమ ఎద్దులను చూసి వాటిని పెంచుతున్న వారు సాదరంగా ఆహ్వానించి ఇళ్ళకుతీసుకు వెళ్లారు. ఉదయం ఎనిమిది గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట దాకా ఆరు రౌండ్లలో ఈ పోటీలు జరిగాయి. మధ్యాహ్నం తర్వాతే క్రీడాకారులలో ఉత్సాహం ఉరకలేసింది. అప్పటి వరకూ రెండు మూడు ఎద్దులను అణచి స్కోరు పెంచుకుంటూ వచ్చిన యువకులు ప్రాణాలకు తెగించి ఎద్దులను అణచివేసేందుకు ప్రయత్నించారు. సాయంత్రం ఆరుగంటలకు ముగిసిన ఈ పోటీల్లో పార్తీబన్ అనే యువకుడు 14 ఎద్దులను అణచివేసి విజేతగా నిలిచాడు. యువకులంతా పార్తీబన్‌కు జేజేలు పలుకుతూ జల్లికట్టు మైదానం నలువైపులా ఊరేగించారు.


జల్లికట్టు క్రీడాకారులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది


తమ రౌండ్ కోసం వేచి ఉంటున్న యువకులు


వాడివాసల్ లోపలకు వెళ్తున్న ఎద్దు


పట్టు తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్న ఎద్దు


బహుమానంగా వచ్చిన పరుపును తీసుకెళ్తున్న యువకుడు


గెలుచుకున్న స్టీల్ అండాను ఇంటికి తీసుకెళుతున్న వ్యక్తి - ఎద్దును అణచివేస్తున్న యువకుడు


ఎద్దులకు ప్రాణహాని కలిగించమంటూ యువకుల చేత ప్రతిజ్ఞ చేయిస్తున్న మంత్రి మూర్తి, కలెక్టర్ సంగీత


పాలమేడు వద్ద ప్రేక్షకుల సందడి


